క్లుప్తంగా

సేంద్రియ ఎరువులు వినియోగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అనసూయ

వెంకటగిరి రూరల్: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ ఏడీఏ అనసూయ పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు జనుము, జీలుగలు, పచ్చిరొట్ట ఎరువులతోపాటు జీవన ఎరువులను కూడా కలిపి వాడాలన్నారు. దీంతో రైతులకు సాగులో ఖర్చు తగ్గడంతోపాటు నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై రైతుల దృష్టి



రైతులకు సూచనలు ఇస్తున్న రామమోహన్

రాపూరు: రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం టెక్నికల్ అగ్రికల్చర్ అధికారి రామమోహన్ సూచించారు. మండలంలోని వేపినాపి గ్రామంలో సోమవారం రైతులతో ఆరుతడి పంటలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వరి పంటేకాకుండా మినుము, పెసలు, నువ్వులు, జొన్న తదితర ఆరుతడి పంటలు సాగుచేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సోమ సుందర్, వీఏఏ హరి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రైతులపై అధికారుల జులుం తగదు



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

సైదాపురం: దళిత రైతులపై అధికారులు జులుం తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మొలకలపూండ్ల రెవెన్యూ పరిధిలో వెంకటేశ్వర్లు, శంకరయ్య, పెంచలయ్య గత 16 ఏళ్లుగా నిమ్మ చెట్లు సాగుచేసుకుంటున్నారని చెప్పారు. వారిని గత పది రోజులుగా పోలీసులు, అధికారులు వేధించడం ఏంటని ప్రశ్నించారు. గతంలో ఉన్న తహసీల్దార్ పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేస్తే, ప్రస్తుతం తహసీల్దార్ తనకు ఏమీ తెలియదని చెప్పడం విడ్డూరమని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిట్టమూరు తహసీల్దార్‌గా నవీన్ కుమార్



చిట్టమూరు: మండల నూతన తహసీల్దార్‌గా వలిపి నవీన్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న కాయల సతీష్‌కుమార్ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో డీటీగా ఉన్న నవీన్‌కు తహసీల్దార్‌గా నియమించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తడ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ కొండపనాయుడు కథనం మేరకు, సూళ్లూరుపేట మండలం, అటకాని తిప్ప గ్రామానికి చెందిన ఏ కార్తిక్ (38) తమిళనాడులోని గుమ్మిడిపూండి పవర్ ప్లాంటులో పని చేస్తున్నాడు. ఇతను ఆగస్టు 30న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చెన్నైలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కార్తిక్ ఆదివారం రాత్రి చనిపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లైబ్రరీ షెల్ఫ్ వితరణ

తడ: మండలంలోని అండగుండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన విజ్ఞాన పాఠ్య పుస్తకాలను భద్ర పరుచుకునేందుకు అనువైన లైబ్రరీ షెల్ఫ్‌ను సూళ్లూరుపేటకు చెందిన లయన్స్ క్లబ్ సిబ్బంది సోమవారం అందజేశారు. క్లబ్ సభ్యులు అప్పారావు జన్మదినం సందర్భంగా సమకూర్చిన షెల్ఫ్‌ను అందజేసి ప్రారంభించారు.

చికెన్ ధరలు 02-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	120
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	220
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	242
లేయర్ చికెన్	:	210



అక్రమంగా ఇసుకను రవాణా సాగుతున్న దారి



రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

దోపిడీకి రహదారి!

- పొలాలు, తోటల్లోంచి నదిలోకి రోడ్ల ఏర్పాటు
- నిరంతరం సాగుతున్న అక్రమ రవాణా
- తరలిపోతున్న మట్టి, ఇసుక

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, బండరాళ్ల మాఫియా కోరలు చాస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే అక్రమ రవాణాకు గేట్లు ఎత్తేసింది. దీంతో కోట్లాది రూపాయల సహజ సంపద అక్రమంగా తరలిపోతోంది. కలువాయి మండలం, రాజుపాళెం సమీపంలోని పెన్నానదిలో ఇసుక తవ్వకాలు ప్రధానంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి ఉండాలి. కానీ ఇక్కడ ఇసుక తవ్వకాలకు ఎన్‌జీటీ అనుమతి ఇవ్వలేదు. అధికారంలోకి వచ్చిన తరువాత తమ్ముళ్లు ఇసుక రేవుల్లో పడి దోచేస్తున్నారు. రాజుపాళెం సమీపంలోనే ఉన్న పెన్నా నదిలోకి దర్జాగా రోడ్డును కూడా వేశారు. అక్కడ లభించే పెద్ద పెద్ద రాళ్లతో పాటు గ్రావెల్, ఇసుకను కూడా నిర్భయంగా తరలించేస్తున్నారు.

రాజుపాళెం నుంచి ఇసుకను రవాణా చేసేందుకు ఓ రైతు పొలంలో కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. రైతుకు కూడా కొంత ముట్టజెప్పి ఆయన పొలంలోంచి కూడా రహదారిని క్లియర్ చేసుకున్నారు. ఈ కొత్త మార్గంలో రాత్రి పూట హైవేమీదుగా ఇసుకను తరలిస్తున్నారు.

నదిలోకి రాచబాట

పర్యావరణానికి తూట్లు పొడుస్తూ పెన్నానదిలోకి రాచబాట వేశారు. తెలుగురాయపురానికి ప్రధాన రహదారి నుంచి నది మధ్యలోకి ఓ మామిడి తోట నుంచి రోడ్డు వేశారు. నది గర్భంలోకి రోడ్డు వేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. అధికార పార్టీ నేతల సహకారంతో ఇసుక మాఫియా నదిలో ఇసుక, గ్రావెల్, బండరాళ్లు దోపిడీ చేస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

మమ్మల్ని ఆపేదెవడురా?

నెల్లూరు జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌ను అక్టోబర్15 వరకు అనుమతులను ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం పక్కన పెట్టి రాజుపాళెం రీచ్‌ల్లో ఇసుక నిత్యం అక్రమంగా రవాణా చేస్తున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో ఇసుకను ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. పగలు, రాత్రి వాహన రాకపోకల ధ్వనులతో స్థానికుల నిద్ర, ప్రశాంతత కరవైంది. ఇళ్లు, రోడ్లు, దుమ్ముకొట్టుకుపోతున్నాయి. రహదారులు సైతం ఛిద్రమవుతున్నాయి. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఈ అక్రమార్జనలో భాగస్వాములయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మానవశక్తితో పూడికతీత పేరు పెట్టి..

పెన్నా నదిలోంచి మానవశక్తితో ఇసుక పూడిక తీత పేరుతో అధికారులు టెండర్లు పిలిచి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఎలాగైనా ఇసుకను అక్రమంగా తరలించేందుకు అధికారులు ఇలాంటి చర్యలు తీసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు మానవశక్తితో నీటిలోని ఇసుకను ఎలా బయటకు తీసి ఎలా లోడింగ్ చేస్తారో అధికారులకే తెలియాలి.

నేడు వైఎస్సార్ వర్ధంతి

సాక్షి నెట్‌వర్క్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల, నియోజకవర్గ కన్వీనర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ

బాలాయపల్లి(సైదాపురం): ప్రీ ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రీ ప్రైమరీ పాఠశాలలపై వెంకటగిరి స్త్రీ సంక్షేమశాఖ సీడీపీఓ శంషాద్‌బేగం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల స్థితి ఎలా ఉందో తెలపాలన్నారు.

కండలేరులో 37.370 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 37.370 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9.100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1200, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటిబ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

108 సిబ్బంది సేవలు ఎనలేనివి



సన్మాన గ్రహీతలతో కృష్ణవేణమ్మ

నాయుడుపేటటౌన్: ప్రమాద సమయాల్లో ఎంతో మంది క్షతగాత్రులను వైద్యశాలలో తరలించడమే కాకుండా ప్రాణాలను సైతం కాపాడుతూ 108 అంబులెన్స్ సిబ్బంది చేస్తున్న సేవలు ఎనలేనివిగా రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆదవరం నాగూరయ్య పేర్కొన్నారు. పట్టణంలో ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో సోమవారం సాయంత్రం 108 అంబులెన్స్ సిబ్బందికి శాలువలు కప్పి మోమెంటోలు, బహుమతులు అందించి ఘనంగా సన్మానించారు. స్థానిక అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దివ్యాంగురాలైన కృష్ణవేణమ్మ సారథ్యంలో ఈ సన్మాన కార్యాక్రమాన్ని నిర్వహించారు. దీంతో కృష్ణవేణమ్మను రోటరీక్లబ్ వారితో పాటు 108 అంబులెన్స్ సిబ్బంది, ధ్యానగురువులు సుబ్రహ్మణ్యం తదితరులు శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

డిపో ఎదురుగా రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు

సూళ్లూరుపేట : స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్ పద్మను డిపో మేనేజర్ అక్రమంగా సస్పెండ్ చేయడంపై డిపో ఎదురుగా సోమవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. గడిచిన నాలుగు రోజులుగా రిలే నిరాహారదీక్షలు జరుగుతుంటే డిపో మేనేజర్ అసలేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఎన్‌ఎంయూ నాయకులు ఎం శేఖర్ అన్నారు. పద్మకు మద్దతుగా సోమవారం డి సుబ్బలక్ష్మి, వి పద్మ, కే మధు, డ్రైవర్లు ఎస్‌కే మస్తాన్, సీహెచ్ వెంకటయ్య, జి ఆనంద్ తదితరులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్ కమిషన్ సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. కండక్టర్ పద్మకు జరిగిన అన్యాయంపై సోమవారం అందరూ స్థానిక ఆర్డీఓ, తహసీల్దార్‌కు వినతిపత్రాలను అందజేశారు.

కుమ్మరికండ్రిగ కాలనీకి త్వరలో రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..



కాలనీవాసులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ మోహన్‌రావు

దొరవారిసత్రం: మండలంలోని శ్రీధనమల్లి గ్రామ పంచాయతీ కుమ్మరి కండ్రిగ ఎస్టీ కాలనీని హౌసింగ్ డీఈ దశయ్య ఆదేశాల మేరకు స్థానిక ఏఈ మోహన్‌రావు సోమవారం సందర్శించి పక్కా గృహాలపై ఆరా తీశారు. ఈ కాలనీదుస్థితిపై 'రోడ్డూ లేదు గూడూ లేదు' అన్న శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి హౌసింగ్ అధికారులు స్పందించి ఎస్టీ కాలనీని ఏఈ సందర్శించారు. కాలనీకి గతంలో ఎన్ని పక్కాగృహాలు మంజూరయ్యాయి వాటి పరిస్థితి ఏంటి అని తెలుసుకున్నారు. ప్రస్తుతం కాలనీలో 45 కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. గ్రామ సచివాలయ సిబ్బంది కూడా కాలనీని సందర్శించి రోడ్డు, కాలనీలో వీధులు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీ రోడ్డుకు మండల నిధుల నుంచి రూ.7లక్షలతో సీసీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి సూర్యకిరణ్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి వరం



: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓజిలి: ప్రకృతి వ్యవసాయంతో పండించే ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాలుష్యం పెరుగుతున్న కారణంతో ప్రకృతిలో సహజ సిద్ధంగా పండిస్తున్న కూరగాయలు, వరి ధాన్యం ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం ప్రజలకు బెండ, మునగ, ఆకకూరలు, నిమ్మ, వంకాయలు తదితర కూయగాయాలు విక్రయించారు. ఈ కార్యక్రమంలో ఓజిలి ఇన్‌చార్జి జైతున్‌బీ, రాజేష్, గురవయ్య, ధనుంజయ, చెంచమ్మ, యామిని, మహేశ్వరీ, సుమతి పాల్గొన్నారు.

గంగ ఒడికి గణపయ్య



తూపిలిపాళెం బీచ్‌లో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

వాకాడు: వినాయకచవితి పర్వదినం సందర్భంగా పూజలందుకున్న గణనాథులు సోమవారం గంగ ఒడికి చేరారు. గణనాథుల విగ్రహాల నిమజ్జన పర్వం తూపిలి పాళెం బీచ్‌లో కొనసాగుతుంది. ఇప్పటివరకు 1024 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

నగరోత్సవం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో బాల గణేశుడి నగరోత్సవం సోమవారం రాత్రి కోలహలంగా నిర్వహించారు.



నాయుడుపేటటౌన్ : నగరోత్సవంలో బాలగణేశుడు

భూ సమస్యలు పరిష్కరించాలి

ఓజిలి: గ్రామాల్లో నెలకొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ పద్మావతి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

భూ సమస్యలపై వినతులు

దొరవారిసత్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ శైలకుమారికి భూసమస్యలపై వినతులు అధిక సంఖ్యలో అందాయి. ఇందులో ముఖ్యంగా నెలబల్లి, పూలతోట, ఏకొల్లు తదితర గ్రామాల్లో భూ ఆక్రమణపై బాధితులు ఫిర్యాదు చేశారు. అడంగళ్లు, 1బీలో చేర్పులు మార్పుల కోసం రైతులు అర్జీలు ఇచ్చారు.

ఎంపీపీ శేఖర్‌రెడ్డి పరామర్శ

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అట్ల చెంచయ్య(65)కుటుంబ సభ్యులను సోమవారం స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన చెంచయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అట్ల గోపాల్, రోశయ్య ఉన్నారు.

విద్యుత్ అంతరాయం నేడు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి శక్తిస్వరూపిణి శ్రీ పోలేరమ్మతల్లి జాతరను పురస్కరించుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు, పునరుద్ధరణ, చెట్ల తొలగింపుపై మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ శీనయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజల గొంతుకై నిలబడదాం



వాకాడులో పార్టీ నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: నిరంతరం ప్రజల గొంతుకై నిలబడదాం ..అరాచక కూటమి ప్రభుత్వాన్ని తరిమి కొడదాం అని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం వాకాడులోని తన నివాసంలో కోట, వాకాడు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముందుగా ఆయన కొత్తగా నియమితులైన మండల పార్టీ కన్వీనర్ ఏనుగు సుధాకర్‌నాయుడు, కమిటీ సభ్యులను శాలువతో సత్కరించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని అరాచకాలు చేసినా, ఎన్ని దొంగ కేసులు పెట్టినా జనాదరణ కల్గిన వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో మత్స్యకారులకు, ముస్లింలకు మధ్య జరిగిన వివాదంలో ఎలాంటి సంబంధంలేని వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమార స్వామి రెడ్డిని, మోమిడి ఎంపీటీసీ వేమారెడ్డి శారదమ్మపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని చెప్పారు. త్వరలోనే కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌నాయుడు, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, సర్పంచులు వెంకటరత్నమ్మ, విజయరెడ్డి, ఉపసర్పంచులు కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, ఎస్ మధురెడ్డి, డి మధురెడ్డి, ఎస్ మధురెడ్డి, గురునాథంరెడ్డి, కల్యాణ్‌రెడ్డి, వెంకటరత్నం, రవి, వెంకటేశ్వర్లురెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణయ్య, సుబ్బారెడ్డి ఉన్నారు.

పంట కాలువ పూడ్చివేత



మట్టితో పూడ్చి వేసిన పంట కాలువ

చిల్లకూరు: స్థానిక చెరువులో తూర్పు పొలాలకు నీటిని అందించే 100వ నంబర్ పంట కాలువను కొంత మంది రాత్రికి రాత్రి పైపులు వేసి జేసీబీలతో పూడ్చి వేసిన సంఘటన చిల్లకూరు పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తించిన మీడియా ప్రతినిధులు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఏఈ ఠాగూర్ సోమవారం వెళ్లి పూడ్చి వేసిన కాలువను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దిగువకు సాగు నీరు పోకుండా ఇలా కాలువను పూడ్చి వేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అయితే కాలువ పూడ్చింది అధికార పార్టీకి చెందినవారు కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మహిమాన్వితుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

- ప్రాచీన శిల్పకళా తోరణం.. మల్లాం ఆలయం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయ ప్రాంగణంలోని శతస్తంభ కల్యాణ మండపం (ఇన్‌సెట్) స్వామివారు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో రాష్ట్రంలోనే స్వయంభువుగా వెలసిన శ్రీ వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామి వారి ఆలయం ప్రాచీన శిల్పకళకు ఆదర్శంగా నిలుస్తోంది. మల్లాం గ్రామంలో ఏడవ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం శిల్పుల ప్రావీణ్యతకు అద్దం పడుతోంది. ఆలయాన్ని ఏడో శతాబ్దంలో చోళరాజు పాండ్యభూపతి నిర్మించాడు. 11వ శతాబ్దంలో కుళుత్తోంగుడు ఆలయాన్ని అభివృద్ధి చేశాడు. ఆలయంలో విఘ్నేశ్వరుడు, కోమలేశ్వరుడు, కాలభైరవుడు, కామాక్షిదేవి, వళ్లీదేవసేన, నటరాజు, విష్ణువు, చండికేశ్వరుడి విగ్రహాలు శిల్పకళకు ప్రతీకగా నిలిచాయి. ఆలయ ప్రాంగణంలో స్వామివారి శత స్తంభ కల్యాణ మండపానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ మండపాన్ని కంచికి చెందిన తండ్రీ కొడుకు ఆర్ముగం స్వామి, కుమారస్వామి నిర్మించారు. భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలను చిత్రీకరించి అత్యంత రమణీయంగా చెక్కారు. శిల్పి కుమారుడు తంజావూరులోని తన ప్రియురాలికి ఈ శత స్తంభ కల్యాణ మండపాన్ని చూపేందుకు ఓ అర్ధరాత్రి అశ్వాలకు ఆయువు పోసి తూర్పు వైపునకు మరలి ఉన్న మండపాన్ని దక్షిణం వైపునకు మరల్చి కదిలిపోయే సమయంలో గమనించిన తండ్రి ఆర్ముగం స్వామి అశ్వాల ముందర కాళ్లు నరికి, కొడుకుని చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. ఇందుకే మల్లాం గ్రామానికి తిరుగుడు మల్లాం అనే పేరు కూడా వచ్చింది. ఈ ఆలయం నిర్మించడానికి దారి తీసిన పరిస్థితులు తెలిపే విధంగా ఆలయ గోడలపై దేవనాగరిక లిపితో 240 శాసనాలను చెక్కించారు.

ఆలయ స్థలపురాణం

స్వామివారు మల్లాసుర, కొల్లాసుర యుద్ధానంతరం బ్రహ్మహత్యా దోషపరిహారార్థం మల్లాం అనే ప్రాంతంలో ఘోర తపస్సు చేస్తుండగా, స్వామి వారిపై పుట్టలు పెరిగి చుట్టూ ముళ్ల పొదలు వ్యాపించాయి. స్వామి వారి పుట్టపై దట్టంగా వెదురు బొంగులు పెరిగాయి. పాండ్య భూపతి కళింగయుద్ధం అనంతరం తమ పరివారంతో రాజ్యానికి తిరిగి వెళుతూ ఈ ప్రదేశంలో విశ్రమించాడు. అక్కడ దట్టంగా పెరిగిన వెదురు బొంగులను చూసి పల్లకీ చేయించుకోవాలన్న కోరికతో సేవకులతో వాటిని నరికించాడు. ఈ సమయంలో తపస్సు చేస్తున్న సుబ్రమణ్యేశ్వర స్వామి రెండు చేతులు తెగిపోయాయి. సేవకులు జరిగిన విషయాన్ని రాజుగారికి తెలిపారు. వెంటనే పాండ్యభూపతికి రెండు కళ్లు కనిపించకుండా పోయాయి. ఆదే రోజు రాజుకి స్వామి వారు స్వప్నంలో కనిపించి తన చేతులు తెగిపడిన చోటే తనకు ఆలయాన్ని నిర్మించాలని సూచించారు. స్వప్నం నుంచి తేరుకున్న రాజుకు ఉదయాన్నే కళ్లు కనిపించాయి. స్వామి వారి ఆజ్ఞ ప్రకారం స్వామి వారి ఆలయం కట్టించి మయూర ఆగమ శాస్త్ర ప్రకారం ప్రతి ఏటా 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.



రథోత్సవం (ఫైల్)

సంతాన భాగ్యం..

సంతానం లేని వారు ధ్వజారోహణం రోజున కొడి ముద్ద ప్రసాదం తీసుకున్న వారికి తప్పక సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఇందు కోసం తమిళనాడు, కర్నాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి కొడిముద్దను స్వీకరిస్తారు. ఆలయ శత స్తంభ కళ్యాణ మండపంలో వివాహాలు చేసుకున్న దంపతులు సుఖ సంతోషాలతో ఉంటారని భక్తుల నమ్మకం. ఆలయంలో కుజదోష నివారణ పూజలు చేయడం వల్ల దోషం పూర్తిగా పోతుందని చరిత్ర చెబుతోంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సెప్టెంబర్ 2న విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు అంకురార్పణ, 3న ధ్వజారోహణం, 7న ఫలాభిషేకం, నందిసేవ, 8న రథోత్సవం, 9న షణ్ముఖ స్వామి కల్యాణం, 10న కల్యాణ రాయబారం, 11న కల్యాణం, తలంబ్రాలు, 12న వసంతోత్సవం, 13న అలకలదోపు, 14న ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శశాంక్ తెలిపారు.